# సూర్యాస్తమయం

"నేను మొదటినుండీ అనుకుంటూనే ఉన్నాను. ఆ రాక్షసిముండ ఇలాటి పని ఏదో చేస్తుందని! (రాక్షసిపేరు సావిత్రి. అరిముగ్గిన ఏపిల్ పండులా బొద్దుగా ఉంటుంది.) దాని షోకులు, ఆ నడక, ఒళ్ళంతా కనిపించేలా ఉల్లిపొర జాకెట్లు—ఏమిటో మరీ పిదపబుద్ధులు వచ్చేశాయి ఈ కాలం ఆడపిల్లలః! నడుస్తూ ఉంటే ముందుకి పడిపోతున్నట్లు ఆ చెప్పులేమిటండీ? ఎన్నడూ చూడలేదు. దాని వ్యవహారం చూసి మొదటనుండీ అనుమానిస్తూనే ఉన్నాను. దానికి పరువూ, మర్యాద ఎలాగూ లేదు. మీకూ నాకూ ఉన్న గౌరవం కాస్త మంటగలిపింది. మనం సంఘంలో మళ్లీ తల ఎత్తుకోలేకుండా చేసింది. "సూరమ్మగారి మేనగోడలు ఎలాటి పని చేసిందో చూశారా!" అని నలుగురూ ముక్కుమీద వేళ్ళు వేసుకుంటూ ఉంటే నాకు ఒళ్ళు దహించుకుపోతూంది. యింతకీ నేను చెప్పేది వింటున్నారా?"

"ఊఁ" చదువుతున్న భగవద్గీత పుస్తకంలోంచి తల ఎత్తకుండానే సమాధానం ఇచ్చారు, రాఘవయ్యగారు. తను ముప్ఫయి ఏళ్ళ వివాహ జీవితంలోనూ ఆయన ఏనాడూ భార్య

దగ్గిర తలఎత్తి సమాధానం ఇవ్వలేదు. ఇన్నేళ్ళుగా లేని అలవాటును ఈ దినం కొత్తగా అలవాటు చేసుకోలేడాయన.

"అయ్యో! నా రాత ఇలా తగులబడింది! యింట్లో ఇలాటి పనులు జరుగుతూ ఉంటే కనీసం మీకు చీమకుట్టినట్లయినా అనిపించటం లేదు. అన్ని వ్యవహారాలు నేను చూసుకొని ఏడవాల్సిందే! సావిత్రిని ఇక్కడకు తీసుకువచ్చేరోజునే చెప్పాను. "ఆ నష్ట జాత రాలిని మనింటికి తీసుకు రాకండీ!" అని. నా మాట విన్నారా? "పాపం. తల్లీ, తండ్రీ లేనిపిల్ల! పెంచి ఒక ఇంటిదాన్ని చేస్తే నా బాధ్యత తీరుతుంది. అదీగాక చనిపోయేటప్పుడు నా చెల్లి సావిత్రిని నా చేతిలో పెట్టి మరీ పోయింది" అని ఎక్కడలేని జాలీ చూపించారు. పుట్టగానే తండ్రిని పొట్టబెట్టుకుందా! అయిదో ఏడు తిరగకుండా తల్లిని మింగేసింది. ఇకమన ఇంటికి వచ్చింది. రాయిలా తిరుగుతున్న రాము రాత్రికి రాత్రి రెండు వాంతులు చేసుకొని చచ్చిపోయాడు. యిక దాని ఉసురు తగలకుండా ఇంతవరకూ జీవాలతో ఉన్నది మీరూ, నేనూ, శేఖరం! అంతే! ఏదో రోజున మనలను కూడా పొట్టబెట్టుకుంటుంది. రుబ్బురోలులా ముఖం ఇదీని...... నేను చెప్పేవి వింటున్నారా?"

"ఊఁ"

ఆడదానికీ చదువులెందుకండీ అంటే విన్నారూ! "ముచ్చట తీర్చుకోటానికి మనకి మాత్రం ఆడపిల్లలెవరు ఉన్నారు?" అంటూ దాన్ని వెనకేసుకొచ్చి దానికి కొమ్ములు

ఇచ్చారు. అందుకే అది అన్నిషోకులు నేర్చుకుంది. ఏమైనా నేను గట్టిగా అంటే "సూరమ్మ మేనగోడల్ని పాపం చాలా బాధలు పెడుతుందిట!" అని లోకుల నింద మాత్రం నాకు మిగిలింది. మొన్న మన పక్కింటి మాణిక్యాంబ అంటూందిట "సూరమ్మ ఒట్టి పిసినారిముండ! ఆ సావిత్రికి తిండికూడా సరిగా పడెయ్యదట!" అని. ఆరోజు రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదంటే నమ్మండి. "పిల్ల ఇప్పటికే పుష్టిగావుంది. ఇంకా లావెక్కితే బాగుండదని భోజనం తగ్గించ" మనేదాన్ని! దానికే ఇంతరాద్ధాంతాలు చేస్తే నేను సహించలేను బాబూ! నేను చెప్పేది వింటున్నారా?"

"నీ మాటలు వినకుండా ఏనాడయినా ఎదురు చెప్పానా, సూరమ్మా!" నిట్టూరుస్తూ అన్నారు రాఘవయ్య గారు.

"ఏమైనా మాట్లాడితే ఇదొకటి! నీమాటకు ఎదురు చెప్పానా? అంటారు. 'సూరమ్మ మొగుడికి అసలు నోరేలే దుట. వేళకు భోజనానికి పిలిస్తే వెళతాడుట. లేకపోతే అదీ లేదు. రామా, కృష్ణా అంటూ ఒకమూల కూర్చుంటాడుట' అనుకుంటారు అందరూ. మీరు మాట్లాడకుండా మేత్తగానే నన్ను పెట్టే బాధలు లోకానికి ఎలా తెలుస్తాయి? మిమ్మల్ని నేను ఏనాడయినా శాసించానా? చెప్పండి! మీరు మంచి వారు, నేను దుర్మార్గురాలినీనా! ఎంత అన్యాయంగా

ఉందండీ! నేను ఎప్పుడయినా మీకు బదులుచెప్పానా? మాట్లాడరేం?

"నువ్వు బదులు చెప్పావని ఎవరన్నారు?" ఆ మహాత్ముని నోటివెంట ఆమాత్రం మాటలు రావటమే చాలు! మళ్ళీ గంటసేపు సమాధానం చెప్పుకోగలదు సూరమ్మ. భగవంతుడు ఆమెకు చక్కని వాగ్ధోరణి ఇచ్చాడు. కాని తగిన ఆరోగ్యం మాత్రం ఇవ్వలేదు. అయిదు నిమిషాలు మాట్లాడి ఎదటి మనిషిని ప్రశ్న వేసి, లేదా హెచ్చరించి, సమాధానం చెప్పేలోపులో తన ఆయాసం తీర్చుకుంటుంది! ముప్ఫయి సంవత్సరాలనుండి వారి ఇద్దరి జీవితం ఇలాగే గడిచిపోతూంది. సంసారానికి వచ్చిన కొత్తలో సూరమ్మ ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానం ఇచ్చేవారు రాఘవయ్యగారు. కాని, రోజులు గడుస్తున్నకొద్దీ ఆయనలో ఆశక్తి నశించింది. క్లుప్తంగా సమాధానం చెప్పి తలదించుకోవటం ఆయన అలవాటు చేసుకున్నాడు. ప్రతి విషయాన్నీ సులువుగా తేల్చి, మాట్లాడకుండా వూరుకోవటం రమ్మకు నచ్చదు.

"ఎవరేమిటండీ! అందరూ అదే మాట. ఉచ్చం,నీచం లేకుండా! అయినా, ఎవళ్లో అనుకునే మాటలు నాకెందుకులెండి! లోకానికి కనిపించేలా భర్త పాదాలకు పూజచెయ్యటం, మనసులో తిట్టుకోవటం నాకు చేతకాదు సుమండీ! మనసులో భక్తి ఉండాలి కాని, పై ఆర్భాటాలెందుకు?

ఇన్నేళ్ళబట్టి సంసారం చేస్తున్నాను. నాలో మీకు ఏమైనా లోపాలు కనిపించాయా? మర్యాద కాపాడుకొంటూ ముప్ఫయి సంవత్సరాలు గుట్టుగా కాలక్షేపం చేశాను. అలాంటిది, సావిత్రివల్ల ఈరోజు వీధినపడ్డాం! ఛీ! ఎలాంటి తప్పుడు పని చేసిందండి! మా వంశంలో ఎక్కడయినా ఇలాంటి మచ్చవుందా? మా నాన్న సంగతి మీకు తెలుసుగా? నిప్పుల్ని కడిగేవాడు! మా అమ్మ సంగతి సరేసరి! మడిబట్ట ఆరేసేటప్పుడు ఇంట్లో పనిపిల్ల చూస్తే మళ్ళీ తడుపుకొని వచ్చేది! పిల్లలికి తలిదండ్రుల బుద్ధులుకాక ఇంకేవరివి వస్తాయండి? మీ చెల్లి పెళ్ళి కాకముందే ఎవర్నో ప్రేమించిందటకదూ! మరి, గాడిద కడుఫున సింహం పిల్ల పుడుతుందా? మీ చాదస్తం కాగా, గంజాయి విత్తనం నాటితే తులసిమొక్క వేస్తుందా? వీళ్ళ నాన్న ఎవరినో ఉంచుకున్నాడని కూడా చెప్పుకునేవారు పాపపుణ్యాలు మనకు తెలియవులెండి! మనకి అలాంటివన్నీ ఎందుకు! మన పెంపకంలో పెరిగిన సావిత్రి ఇలాంటి పని చేసిందంటే తల కొట్టేసినట్లుగా ఉంది. ఇంతకూ నేను చెప్పేది వింటున్నారా? లేక నోరు నెప్పే మిగులుతూందా?”

“చెప్పు! వింటున్నాను!”

“వినకేం చేస్తారులెండి! చెవులు ఉన్నాయి కాబట్టి ‘తప్పదురా భగవంతుడా!’ అనుకొంటూ వింటున్నారు. అయినా, మీకులేని బాధ నాకెందుకులెండి! ఇలాంటి ముదన

ష్టపుదాన్ని మన శేఖరానికిచ్చి వివాహం చేస్తావంటారా? ఇంకా నయం! పెళ్ళిచేసి పాపం వాడి గొంతుక కోశాంకాదు! ముందుగానే దానిసంగతి అర్థమయింది. ఆ మూడుముళ్ళూ పడి ఉంటే ఎంత ఘోరంగా ఉండేది! ఎంత తెగింపు చేసింది! కట్టుకున్న బట్టలతో ఇల్లువదలి ఎవడితోనో లేచిపోయింది. రామరామ! తలుచుకుంటునే అసహ్యం వేస్తూంది. ఇక ఈ జన్మంలో చచ్చినా దాని ముఖం చూడదలుచుకోలేదు. మళ్ళీ దాని సంగతి ఇంట్లో జ్ఞాపకం చేసుకున్నారంటే నేను ఉరోసుకొని చస్తాను! వింటున్నారా? మీతో కూర్చుంటే నాకు అవతల బోలెడు పనులు ఉన్నాయి! అన్నం మాడిపోతూంది కూడను...

అన్నం మాడిపోవటం కాదుకదా, ఆకాశం తిరగబడిపోతున్నా ఆవిడ తన ఉపన్యాసం ఆపదని ఆయనకు తెలుసు. అందుకే మరోసారి "ఊఁ" అన్నాడు. కష్టంలేని పని!

సూరమ్మగారి ధోరణికి తగిన రీతిలో సమాధానాలు రావటంలేదు. అందుకే ఆవిడ తన వాగ్ధోరణిలో కొంచెం మార్పు తెచ్చింది! సూటిగా తన అస్త్రాలను ప్రయోగించటం ప్రారంభించింది.

"అన్నం కాస్త బిరుసెక్కితే "ఇదేమిటి, సూరమ్మా? అన్నానికి కొత్త రుచివచ్చింది." అంటారు. స్పష్టంగా చెప్పకూడదూ బిరుసెక్కిందని! రోజూ వంటచేస్తున్నాను కాబట్టి

ఒకరోజు ఉడకటం, మరో రోజు మాడిపోవటం—ఇలాటివి ఏవో సంభవిస్తూనే ఉంటాయి. వాటికే అంతలా చెప్పిపొడవాలా? ఆయాసంగా ఉంటున్నా, లేని ఓపిక తెచ్చుకొని ఇంత వండి పడేస్తున్నాను. అందుకు సంతోషించండి. మంచంఎక్కి మహారాణిలా కూర్చుని, కోడలుచేత పనులు చేయించుకోవలసిన వయసునాదీ! అలాటిది, ఓపికగా చేస్తూంటే మీకు నాపైన రవంత జాలిలేదేమిటండీ? పైగా నిన్నరాత్రి భోజనం చేస్తూ "ఇదేమిటి. సూరమ్మా? కూరలో ఉప్పుతక్కువయింది. పచ్చడితోబాటు నంజుకొని తింటే సరిపోయిందిలే!" అన్నారు అంటే పచ్చడిలో ఉప్పు ఎక్కువయిందనేగా మీరనేది? ఎంత చక్కగా మాటలు నేర్చుకున్నారండీ! పైగా "సూరమ్మ మొగుడికి అసలు నోరే లేదుట! అన్నం ఎలాతింటాడో!" అని లోకులు అతిశయోక్తులు చెప్పుకుంటారు. ఈ గొడవలన్నీ ఎవరికి తెలుస్తాయి? అబ్బ! ఆయాసంగా ఉందండీ!" ఆ ఆసుపత్రి రంగు నీళ్ళు వద్దండీ!" ఆయుర్వేదం మందులు తీసుకురండి. అంటే నామాట వినరుకదా! ఎప్పుడో ఒకరోజున ఇలా మాట్లాడుతూ, ఆయాసంతో గుండెనొప్పితో హఠాత్తుగా చస్తాను. అప్పుడు మీరు శాంతిగా వుందురుగాని...... వింటున్నారా?"

భగవద్గీతలోంచి తల ఎత్తి ఒకసారి సూరమ్మ ముఖంలోకి చూశారు ఆయన. "చచ్చిపోతా" నని ఆవిడ పలికినప్పుడల్లా ఆముఖంలోకి చూడటం అలవాటయింది. ఆవిడ

ముఖంలో నిశ్చలత్వం తప్ప మరో భావమేదీ ఆయనకు కని పించదు. అది నీటిలో బండరాయి పడేసినా తొణకని నిశ్చ లత ! మళ్ళీ ముఖం దించుకుంటూ "ఊ!" అన్నారు.

"నేను ఇంత బాధ అనుభవిస్తూ వుంటే మీకు కాస్త యినా సానుభూతి లేదు. ఇక ఎవరి సానుభూతీ నాకు అక్కర లేదు లెండి. నాకూ జీవితంమీద మోజుపోతూంది. శేఖరం హాయిగా నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నాడు. వాణ్ణి ఒక ఇంటి వాడ్నిగా చేసి, లక్ష్మీదేవిలా కోడలు ఇంట్లో తిరుగుతూఉంటే చూసి, హాయిగా కళ్ళు మూసేస్తాను. ఆ! మరిచిపోయాను ! విశాఖపట్నం సంబంధం నచ్చిందని రాసి పడెయ్యండి. రేపు మాఘ మాసంలో కల్యాణం జరిపించవచ్చు! ఈ సావిత్రిపీడ కాస్తా మనకు తప్పిపోయిందిగా! వాళ్ళకు ఈరోజే వుత్తరం రాసి పడెయ్యండి! యిందాక నేను పక్కింటికి వెళ్ళినప్పుడు పోస్టుమన్ ఏదో ఉత్తరం ఇచ్చాడట, నాకు చూపించ కూడ దేమిటి? కొంపదీసి మీ మేనకోడలు సావిత్రి కాని వ్రాసిందా? ఇలా ఇవ్వండి." రాఘవయ్యగారు కళ్ళజోడుసరిచేసుకొంటూ గీత కాగితాల మధ్య ఉన్న కవరుతీసి అందించాడు.

"మన శేఖరం వ్రాశాడుటండీ! మరి. చూపించ రేం?"

"ఎలాగూ మాట్లాడుతున్నావుకదా! పూర్తిఅయ్యాక ఇవ్వవచ్చునులే అని వూరుకున్నాను.

"నా రాత యిలా తగులడిందిలెండి! ఇరవై నాలుగు గంటలూ వసపిట్టలా వాగుతూనే ఉంటుంది. అని చెప్పిపోడు స్తున్నారు కదూ నేను ఏదో పాపం చేసుకుని వుంటాను. ఎంత మంచిగా మాట్లాడినా తిట్లే మిగులుతున్నాయి" అంటూ ఉత్తరం విప్పి చదడటం ప్రారంభించింది.

"శ్రీ నాన్నగారి పాదపద్మములకు!

నమస్కారములు. ఈ వుత్తరంలో సాహసించి ఒక విషయం వ్రాస్తున్నందులకు క్షమాపణ కోరుకుంటున్నాను. నేనూ, సావిత్రీ చిన్నతనం నుండీ కలిసి మెలిసి ఆడుకుంటూ ఒకే ప్రాణంగా పెరిగాం. ఆమెనే వివాహం చేసుకొని సుఖ జీవనం చెయ్యాలని కలలుకన్నాను. కాని, అమ్మ ప్రోద్బలం వల్ల మీరు మరో సంబంధం నిశ్చయం చేస్తారని విన్నాను. నాకు సావిత్రిని వదిలి మరొకరిని వివాహం చేసుకోవటంఇష్టం లేదు. ఈ విషయం అమ్మ ప్రాణంపోయినా ఒప్పుకోదని తెలుసును. అందుకే నేనుఅనుకున్న ప్లాను ప్రకారం సావిత్రిని బయలుదేరి ఇచటకురమ్మని చెప్పాను. సావిత్రి ఇచటకు క్షేమంగా చేరుకొంది.

నిన్ననే రిజిస్ట్రారు ఆఫీసులో ఇద్దరం వివాహం చేసుకున్నాం. నాలుగు దినాల్లో మీఆశీర్వచనంకోసంబయలుదేరి వస్తున్నాం.

శేఖరం"

ఉత్తరం చదవటం ముగించింది సూరమ్మ.

అగ్నిపర్వతాలు పేలిపోయాయి. కొండలు పగిలిఇసుక రేణువులుగా మారిపోయి సముద్రంలో కలిసిపోయాయి. సముద్రాలు పొంగి పొర్లాయి.

గుండెనొప్పితో మెలికలు తిరిగి, ఆయాసంతో నేల మీదికి ఒరిగిపోయింది సూరమ్మ. తీక్షణంగా లోకాన్ని పాలించిన సూర్యుడు పశ్చిమాన కొండల వెనక జారిపోయాడు. సూర్యాస్తమయం అయింది. ప్రకృతి తేలిగ్గా వూపిరిపీల్చుకొని బరువుగా నిట్టూర్చింది.

★★★